# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రతి నలుగురు భారత ఐటీ నిపుణుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఒక వ్యక్తి ఉంటున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ను నిలిపే ప్రయత్నంలో రైల్వేశాఖ పాత్ర అత్యంత కీలకమని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు.

- రాజధాని నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వాగుల నీటి నిల్వ సామర్థ్యాలను పెంచుతున్నామని మంత్రి పి. నారాయణ తెలిపారు.

- వరద బాధితులను కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు.

==============================

ప్రతి నలుగురు భారత్ ఐటీ నిపుణుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఒక వ్యక్తి ఉంటున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈరోజు గుజరాత్‌లోని గాంధీనగర్‌లో నిర్వహించిన "రెన్యువబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్"లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్థిక సంస్కరణలకు ముందు వృద్ధిరేటు సాధారణంగా ఉండేదని, 1991లో సంస్కరణల తర్వాత ఆర్థిక సంస్కరణల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని అన్నారు. ప్రస్తుతం గ్రీన్ ఎనర్జీ రెవెల్యూషన్ మొదలైందని, నేడు విద్యుత్ రంగంలో గణనీయమైన సంస్కరణలు వచ్చాయని తెలిపారు. 2014లో ఆంధ్రప్రదేశ్‌లో సౌర, పవన విద్యుత్ ప్రవేశపెట్టామని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

==============================

ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ను నిలిపే ప్రయత్నంలో రైల్వేశాఖ పాత్ర అత్యంత కీలకమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖ - దుర్గ్ మధ్య వారానికి 6 రోజులు పాటు నడిచే వందే భారత్ రైలును ఈ రోజు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దృశ్య మాధ్యమ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాఖ రైల్వే స్టేషన్లో జరిగిన కార్యక్రమానికి కేంద్రమంత్రి రామ్మోహననాయుడు ముఖ్య అతిథిగా

హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్తకం, పర్యాటకం, మౌలిక వసతుల కల్పన, వ్యవసాయం వంటి కీలక రంగాలు రైల్వేల పైనే ఆధారపడి ఉన్నాయన్నారు. రైల్వేకు నూతన జవసత్వాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు.

==============================

రాజధాని నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మూడు వాగుల నిల్వ సామర్థ్యాలను పెంచుతున్నామని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు. విజయవాడ CRDA ప్రధాన కార్యాలయంలో ఈ రోజు మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.... నీటి నిల్వ సామర్థ్యాలను పెంచే విధంగా కొండవీటి వాగు, పాల వాగు, గ్రావిటీ కాలువను డిజైన్ చేస్తున్నామని తెలిపారు. రానున్న రెండు నెలల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, వెంటనే పనులు ప్రారంభించి వచ్చే వర్షా కాలంలోగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. బుడమేరు కారణంగా రాజధాని పరిసర ప్రాంతాలకి ఎలాంటి ముప్పు లేదని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

==============================

తిరుపతి జిల్లాలోని తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ఈ రోజు నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయంలో సంవత్సరం పొడవునా నిర్వహించే పలు క్రతువుల్లో తెలియక జరిగిన దోషాల నివారణకు ప్రతి ఏడాది మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలను ఆనవాయితీగా తిరుపతి తిరుమల దేవస్థానం (టిటిడి) నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా ఈరోజు ఉదయం వేద పండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య పవిత్ర ప్రతిష్ట జరిగింది. రేపు పవిత్ర సమర్పణ, ఈనెల 18వ తేదీ చివరి రోజు పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తిరుచానూరు ఆలయ అర్చకులు తెలిపారు.

విరామం

==============================

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో రేపు మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్, ఎంఎస్సీ విద్యార్హతలు కలిగి 18 నుండి 30 సంవత్సరాల వయస్సు గల యువతీ,యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చునన్నారు. ఉదయం 9 గంటల నుండి పాలకొండ శ్రీ సత్య సాయి డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ మెగా జాబ్ మేళా ద్వారా 1,050 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు 16 కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని వివరించారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను skilluniverse.apssdc.in వెబ్ సైట్ లో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. వివరాలకు 63012 75511, 7993 795796 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

==============================

ముహమ్మద్ ప్రవక్త జన్మదినమైన ఈద్ మిలాద్-ఉన్-నబీ పండుగ ను ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ పండుగ సందర్భంగా శ్రీకాకుళం జామియా మసీదులో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మసీదు కమిటి అధ్యక్షులు మహిబుల్లా ఖాన్ ఆధ్వర్యంలో నగరంలో శాంతి ఊరేగింపు నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త శాంతి, ఐక్యతకి చూపిన మార్గం అనుసరణీయమని అందరూ సోదర భావంతో జీవించాలని ఈ సందర్భంగా మహిబుల్లా ఖాన్ అన్నారు. అనంతపురం నగరంలో ముస్లిం సోదరులు నిర్వహించిన ఊరేగింపులో నగరపాలక సంస్థ మేయర్ వసీం సలీమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రవక్త మహమ్మద్ ప్రపంచానికి శాంతిని ప్రభోదించారని అన్నారు.

==============================

ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఈ రోజు విశాఖ ఆర్కే బీచ్ రోడ్ లో ఇంటిగ్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓజోన్ పొర దెబ్బ తినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన బాధ్యతల తెలియజేస్తూ... విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వృక్ష శాస్త్ర ఆచార్యులు స్వాతి మాట్లాడుతూ.. రిఫ్రిజిరేటర్లు, ఏసీల నుంచి విడుదలయ్యే క్లోరో ఫ్లోరో కార్బన్ల వల్ల ఓజోన్ పొర దెబ్బతింటుందని అన్నారు. వీటి అత్యదిక వినియోగం పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. ఓజోన్ పొర కాపాడుకోవాల్సిన భాధ్యతను ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని కోరారు.

==============================

వరద బాదితులను కేంద్ర ప్రభుత్వం అన్ని విదాలా  ఆదుకుంటుందని కేంద్ర భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. ఈ రోజు విజయవాడ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో వారధి కార్యక్రమంలో మంత్రి పాల్గొని పాత్రికేయులతో మాట్లాడారు. వరద కారణంగా నష్టపోయిన రైతులను ప్రత్యేకంగా ఆదుకునేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో చర్చిస్తున్నామని వివరించారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న ప్రజలకు, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందజేస్తున్నదని పేర్కొంటూ....

(వాయిస్ 32 సెకన్లు)

==============================

రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖల ద్వారా ప్రజలకు మర్యాదపూర్వక సేవలను, స్నేహ పూర్వక వాతారణంలో అందించేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్.పి. సిసోడియా అన్నారు. ఈ రోజు విజయవాడలోని గుణదల సబ్ రిజిస్టార్ కార్యాలయంలో ప్రత్యేక పోడియం తొలగించే కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. స్వయంగా పోడియం తొలిగించే పనులలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్. పి. సిసోడియా మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులు కూడా ప్రజాసేవకులే అనే భావన ప్రజలలో కల్పించేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

==============================

చిత్తూరు జిల్లా కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున టిటిడి కార్యనిర్వహణ అధికారి జె. శ్యామల రావు పట్టువస్త్రాలను ఈరోజు సమర్పించారు. ప్రతి ఏడాదీ బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాలను సమర్పించడం టిటిడికి ఆనవాయితీగా వస్తోంది. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న టిటిడి ఈఓకు ఆలయ ఈవో గురుప్రసాద్, ఏఈవో విద్యా సాగర్, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.

==============================
==============================